క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: ఆరిలోవ ఎస్ఎస్ 33/11 కేవీ, ఆరిలోవ 11 కేవీ, హనుమంతవాక 11 కేవీ ఫీడర్ల పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయా ఫీడర్ల పరిధిలోని వాణిజ్య పన్నుల విభాగం కార్యాలయం, చినగదిలి, సంతపాలెం, పెదగదిలి, గాంధీనగర్, ఆరిలోవ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త బాధ్యతల స్వీకరణ



ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త సింహాచలాన్ని అభినందిస్తున్న ఆచార్య హరనాథ్

మద్దిలపాలెం: ఆంధ్రా యూనివర్సిటీ జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) సమన్వయకర్తగా చిత్రకళా విభాగాధిపతి డి.సింహాచలం సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆచార్య ఎస్.హరనాథ్, పలువురు ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

మోయలేనంత భారం



ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లను తరలిస్తున్న వ్యాపారులు

ఏయూక్యాంపస్: పర్యావరణంపై మోయలేనంత భారం పడుతోంది. రహదారులపై నిత్యం కనిపించే వందలాది మంచినీళ్ల బాటిళ్లను సేకరించి కొందరు విక్రయిస్తుండటమే దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. ఇలా సేకరించిన ఖాళీ ప్లాస్టిక్ సీసాలను వ్యాపారులు కొనుగోలు చేసి, పరిశ్రమలకు తరలిస్తారు. అక్కడ వారు వీటిని రీ సైకిల్ చేస్తుంటారు. ప్రస్తుతం ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం గణనీయంగా పెరిగింది. తాగు నీటి నుంచి పానీయాల వరకు అన్నీ ప్లాస్టిక్ బాటిళ్లలోనే విక్రయిస్తున్నారు. కూల్‌డ్రింక్స్ తాగిన తరువాత బాటిళ్లను రోడ్డుపై, డస్ట్‌బిన్‌ల్లో పడేస్తున్నారు. కొన్ని సార్లు ఇవి కాలువల్లో పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. పర్యావరణానికి ఇవి ఎంతో హానికరంగా కూడా మారుతున్నాయి. ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగం వీలైనంత వరకు తగ్గించాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పలువురు సూచిస్తున్నారు.

అంతర్ దృష్టితో ఆకట్టుకున్న విద్యార్థులు



ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి, విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీకాలనీ: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో ఎంవీపీ కాలనీ ఉషోదయ జంక్షన్‌లోని కిడ్జ్ గార్డెన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. హైదరాబాద్ రవీంద్ర భారతి వేదికగా గ్లోబల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఈ వేడుకల్లో సిక్స్ సెన్స్ ప్రదర్శనతో అందరినీ ఆకట్టుకున్నారు. కళ్లకు గంతలు కట్టుకొని అంతర్ దృష్టి ద్వారా రంగులు, అక్షరాలను గుర్తించడంతోపాటు మైండ్ పవర్‌తో ఏడాది మొత్తం చదివే పుస్తక విజ్ఞానాన్ని ఒకే రోజులో చదివి గుర్తించుకోవడం వంటి ప్రతిభా పాటవాలను ప్రదర్శించి అందరి మన్ననలు పొందారు. విద్యార్థుల ప్రతిభను నిర్వాహకులు ప్రశంసించారు. ఈ సందర్భంగా కిడ్జ్ గార్డెన్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిలక్ష్మితోపాటు విద్యార్థులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

రహదారుల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

- ఎంవీపీ సెక్టార్-10లో వారానికే రాళ్లు తేలిన బీటీ రోడ్డు
- కొన్నిచోట్ల తక్షణ అవసరం లేకున్నా రోడ్ల నిర్మాణం
- తూతూ మంత్రంగా పనులు
- జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల విమర్శలు



ఎంవీపీ కాలనీ సెక్టార్-10లో వారంలోనే రాళ్లు తేలిన కొత్తగా నిర్మించిన రహదారి

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 18వ వార్డు ఎంవీపీ కాలనీ సెక్టార్-10లో ఇంజినీరింగ్ విభాగం ఇటీవల చేపట్టిన రోడ్ల నిర్మాణంలో నాణ్యతను గాలికొదిలేశారు. సెక్టార్-10లోని గిరిజన బాలికల వసతి గృహం, భాష్యం స్కూల్స్ రోడ్లతో పాటు ఆ ప్రాంతంలోని పలు రహదారుల నిర్మాణం దాదాపు రూ.40 లక్షలతో ఇటీవల జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు చేపట్టారు. ఆయా రోడ్ల నిర్మాణంలో కనీస నాణ్యత పాటించలేదనే విమర్శలు వస్తున్నాయి.

వారం కిందట కొత్తగా నిర్మించిన ఆయా రోడ్లలో పలు చోట్ల రాళ్లు తేలిపోవడమే ఇందుకు నిదర్శనం. నిబంధనల ప్రకారం రోడ్డు మందం పాటించకపోవడం, రోలింగ్ సక్రమంగా చేయకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తినట్లు పలువురు పేర్కొంటున్నారు. ఆయా పనులు స్థానిక ఇంజినీరింగ్ ఏఈతోపాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో చేపట్టినప్పటికీ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కవ్వడం, నాణ్యత ప్రమాణాలు పాటించడంలో అంతులేని నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందనే స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

అవసరం లేకున్నా.. రోడ్ల నిర్మాణం

ఎంవీపీ సెక్టార్-10లో తక్షణ అవసరం లేకున్నా పలు రోడ్లు నిర్మాణం చేపట్టడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. సెక్టార్-10లో గిరిజన బాలికల వసతి గృహాన్ని ఆనుకుని ఉన్న రోడ్డుకు అనుసంధానంగా పలు రహదారులు నిర్మించారు. అవి ప్రస్తుతం పెద్దగా పాడైన దాఖలాలు లేవు. పెద్దగా రద్దీలేని ఆయా రోడ్లు మరో 3, 4 ఏళ్లు సేవలు అందించే పరిస్థితి ఉంది. అయినా ఇంజినీరింగ్ అధికారులు హుడావుడిగా ఆయా రోడ్ల నిర్మాణం చేపట్టడం వెనుక ఆంతర్యమేంటనే ప్రశ్న ప్రస్తుతం పెద్ద ఎత్తున వినిపిస్తోంది.



కనీస మందం, నాణ్యత లేకుండా నిర్మించిన రహదారి

అధ్వాన రహదారులు కనిపించవా..?

ఇప్పటికీ ఎంవీపీ కాలనీలోని పలు రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. గతంలో ఆయా రహదారుల పరిస్థితిపై వార్తా పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయి. ప్రస్తుతం రోడ్లు నిర్మించిన సెక్టార్-10ను ఆనుకుని ఉన్న 19వ వార్డులోని సెక్టార్-11, సెక్టార్-12ల్లో డబుల్ రోడ్డును ఆనుకొని లాసన్స్ బే పోస్ట్ ఆఫీసుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. పైగా రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కూడా అదే రోడ్డులో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్ విభాగం రద్దీగా ఉండే అలాంటి రోడ్లను వదిలేసి.. అవసరం లేని చోట రహదారుల నిర్మాణం చేపట్టడంపై పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి ప్రజాధనాన్ని వృథా చేయకుండా అవసరమైన చోట్ల రహదారి సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



కొత్తగా రోడ్లు నిర్మించిన సెక్టార్-10ను ఆనుకుని ఉన్న సెక్టార్-11లో అధ్వానంగా రహదారి



తక్షణ అవసరం లేకున్నా నిర్మించిన రోడ్డు



నిర్మాణానికి ముందు గుంతలు కూడా లేని అదే రోడ్డు

ఎకో బజార్‌కు కొత్త కళ



నూతన రంగులతో సుందరంగా జీవీఎంసీ - ఎకో బజార్

ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో అధికారుల చర్యలు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జీవీఎంసీ - ఎకో బజార్ చాలా కాలం నిర్లక్ష్యానికి గురైంది. తాజాగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న సాగర తీరం వేదికగా నిర్వహించే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు బీచ్ రోడ్డును సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ క్రమంలో తుప్పుపట్టిన ఎకో బజార్ షట్టర్లకు రంగులు వేశారు. బోర్డును మార్చి, ఇక్కడ ఉన్న దుకాణాల లోపల సైతం అవసరమైన మరమ్మతులు పూర్తిచేసి రంగులు వేశారు. ఈ దుకాణాల గోడలపై యోగాసనాలు వేస్తున్న యోగాంధ్ర బొమ్మలను చిత్రీకరించారు. ఫుట్‌పాత్ నుంచి ఎకో బజార్‌కు అవసరమైన మెట్లు వంటివి సైతం నిర్మించారు. దీనితో ఎకో బజార్ కొత్త కళను సంతరించుకుంది. ప్రస్తుతం ఇక్కడ ఒక దుకాణం మాత్రమే విక్రయాలు జరుపుతోంది. మిగిలిన రెండు ఖాళీగా ఉన్నాయి. వీటిని ప్రకృతి ఉత్పత్తులు చేసే వారికి అద్దెకు ఇస్తే ఎంతో బాగుంటుంది. వీటిని సైతం వినియోగంలోకి తీసుకొచ్చే దిశగా అధికారులు ఆలోచించాల్సిన అవసరముంది.

ముర్రా జాతి ఆబోతుల వేలం రేపు

ఆరిలోవ: పశు సంవర్ధక శాఖ జిల్లా కార్యాలయ ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ ఏజెన్సీ(ఏపీఎల్‌డీఏ)కి చెందిన ఫ్రోజన్ సెమెన్ బుల్ స్టేషన్‌లో ముర్రా జాతికి చెందిన నాలుగు ఆబోతులను ఈ నెల 18న వేలం వేయనున్నట్లు ఉప సంచాలకుడు డాక్టర్ రెడ్డి నీలయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమంతవాక వద్ద విమ్స్ ద్వారం పక్కన పాత డెయిరీఫారం ప్రాంగణంలో బుధవారం ఉదయం 10 గంటలకు వేలం జరుగుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఆసక్తి గల రైతులు వివరాల కోసం 81427 28872 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

రెడ్‌బుక్ పాలనకు చరమగీతం పాడాలి



'జగన్ అంటే నమ్మకం-చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ శ్రేణులు

మద్దిలపాలెం: రెడ్‌బుక్ పేరుతో రాష్ట్రంలో చట్ట వ్యతిరేక పాలన సాగిస్తున్నారని, దీనికి చరమగీతం పాడేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు అన్నారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో సోమవారం 'జగన్ అంటే నమ్మకం - చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను దగా చేసిందన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఏం చేశారు, ఇప్పుడు సీఎం చంద్రబాబు చేస్తున్న మోసపూరిత పాలన గురించి ఈ పుస్తకంలో సమగ్రంగా వివరించారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ తెలిసేలా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను తెలియజేయాలని పార్టీ శ్రేణులకు మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, జిల్లా నాయకులు పల్లా దుర్గారావు, పేర్ల విజయ్‌చందర్, మువ్వల సురేష్, ఉమ్మిడి దాసు, అల్లంపల్లి రాజబాబు, బోని శివరామకృష్ణ, పీతల గోవింద్, దేవరకొండ మార్కండేయులు, శిరీష, సాగరిక, పులగం కొండారెడ్డి, చొల్లంగి నాగేశ్వరరావు, పతివాడ కనకరాజు, వెంకట్, మధుపాడ రవి, నీలారెడ్డి, ఉమ్మిడి కల్యాణ్, బోండా శ్రీను, వానపల్లి ఈశ్వరరావు, పసంగి వాసు, బోస రమణరెడ్డి, సీనియర్ నాయకులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

శిథిల రహదారికి మరమ్మతులు



పెదగదిలి వద్ద బాగుచేసిన సర్వీస్ రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు పెదగదిలి సర్వీస్ రోడ్డులో శిథిలమైన భాగాన్ని అధికారులు బాగుచేశారు. పెదగదిలి జంక్షన్ నుంచి శివాలయం మీదుగా చినగదిలి కూడలి వరకు సర్వీస్ రోడ్డు పలు చోట్ల శిథిలమైంది. ఇక్కడ కొండవాలు ప్రాంతానికి చెందిన కాలనీల కోసం ఈ రోడ్డులో గతంలో యూజీడీ పనులు జరిగాయి. వీటిలో భాగంగా జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు రోడ్డు మధ్యలో తవ్విన గోతులను మట్టితో పూడ్చి దానిపై సీసీ వేశారు. కొన్నిచోట్ల అప్పట్లో గోతులు సరిగా పూడ్చకుండా పైన సీసీ రోడ్డు వేయడంతో ఆయా భాగాలు తొందరగా శిథిలావస్థకు చేరాయి. దీనిపై 'శిథిలమవుతున్న సర్వీస్ రోడ్డు' శీర్షికన ఈ నెల 6న 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. శిథిలమైన రోడ్డు భాగాలను బాగుచేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీల సమస్యలను తక్షణం పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి శ్యామలాదేవి

మద్దిలపాలెం: అంగన్‌వాడీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్యామలాదేవి డిమాండ్ చేశారు. ఇసుకతోట కృష్ణ మందిరం రోడ్డులోని ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ అంగన్‌వాడీ సెంటర్ వద్ద సోమవారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతున్న ప్రజా సాధికార సర్వేలో అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, హెల్పర్లను ప్రభుత్వ ఉద్యోగి అనే నమోదును ప్రక్రియ నుంచి తొలగించాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలన్నీ అంగన్‌వాడీ టీచర్లు, మినీ టీచర్లు, ఆయాలకు కచ్చితంగా వర్తింపజేయాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీకి గౌరవ వేతనాల బిల్లును అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. పిల్లలకు వండి వడ్డించే మెనూ రేట్లు పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు సరకులన్నీ ప్రభుత్వమే చేర్చాలని సూచించారు. ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు వెంటనే పెంచాలని, అంగన్‌వాడీ సెంటర్లకు రేషన్ సన్న బియ్యం సప్లై చేయాలని డిమాండ్ చేశారు. యాప్స్‌ను తక్షణమే సవరించాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు రమాదేవి, పి.కృపారాణి, రమ తదితరులు పాల్గొన్నారు.

'తూర్పు'లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న మొల్లి అప్పారావు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డులో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పార్టీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పార్టీ ఏ కార్యక్రమం నిర్వహించినా.. అందరూ ఐక్యంగా పాల్గొనాలన్నారు. వార్డుల్లో కార్యకర్తలంతా ఏకాభిప్రాయానికి వచ్చి బూత్, వార్డ్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా కమిటీల్లో పార్టీలో సీనియర్లకు అవకాశం కల్పించాలన్నారు. సమన్వయకర్తగా తాను నిత్యం అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఈ సందర్భంగా సమన్వయకర్తగా నియామకమై మొదటిసారి వార్డును సందర్శించిన మొల్లి అప్పారావును వార్డు కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి పల్లా దుర్గారావు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు నీటి పైపుల తరలింపు



నిల్వ ఉంచిన నీటి పైపులను పొక్లెయిన్‌తో వేరేచోటకు తరలిస్తున్న సిబ్బంది

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డు పక్కన రామకృష్ణాపురం ఎదురుగా జీవీఎంసీ ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న నీటి పైపులను ఎట్టకేలకు బయటకు తరలిస్తున్నారు. గతంలో ఇక్కడ రామకృష్ణాపురం ఉండేది. బీఆర్‌టీఎస్ నిర్మాణంలో అధికారులు ఈ గ్రామాన్ని తొలగించాల్సి వచ్చింది. అందులో రోడ్డు నిర్మాణం జరగ్గా.. కొంత స్థలం ఖాళీగా మిగిలింది. దానిలో ఓ కాంట్రాక్టర్ నీటి సరఫరా పైపులను వందల కొలదీ నిల్వ ఉంచాడు. సుమారు ఎనిమిదేళ్లుగా పడి ఉన్న ఈ పైపుల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు దట్టంగా అల్లుకున్నాయి. దీంతో ఇవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. దీనిపై స్థానికులు పలుమార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు వారు స్పందించి ఆ పైపులను పొక్లెయిన్‌తో బయటకు తీసి పెద్ద లారీల్లో వేరే చోటకు తరలిస్తున్నారు. రెండు రోజులుగా వాటిలో సగం పైపులను బయటకు తరలించారు.

డయేరియాపై అవగాహన

మహారాణిపేట: అతిసార వ్యాధి నివారణ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. డయేరియాపై అవగాహన కల్పిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు సోమవారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో జిల్లా కార్యాలయం నుంచి సత్యం కూడలి మీదుగా తిరిగి కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి జూలై 31 వరకు జిల్లాలో డయేరియాపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బి.లూసీ కార్డిలియా, జిల్లా ఆస్పత్రి సేవా సమన్వయకర్త డాక్టర్ పి. శంకర ప్రసాద్, జిల్లా ప్రోగ్రాం అధికారులు, పారా మెడికల్ సిబ్బంది, ప్రభుత్వ ప్రాంతీయ శిక్షణ కేంద్ర నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగాంధ్ర ర్యాలీ



యోగాంధ్ర ర్యాలీ చేస్తున్న కృష్ణా కళాశాల విద్యార్థులు, అధికారులు

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం యోగాంధ్ర ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ నెల 21న విశాఖ బీచ్ రోడ్డు వేదికగా నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ముందుగా కళాశాల విద్యార్థులకు యోగా ట్రైనీలు వివిధ ఆసనాలపై శిక్షణ ఇచ్చారు. ర్యాలీలో డిప్యూటీ కలెక్టర్ సత్యపద్మ పాల్గొని విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామ్ వేదవ్యాస్, ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



సాయినగర్‌లో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న మొల్లి అప్పారావు, కమిటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు దుర్గాబజార్ సమీపం సాయినగర్‌లోని షిర్డీసాయిబాబా మందిర వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సాయినగర్ పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు స్థానిక పార్టీ నాయకులు, కమిటీ నిర్వాహకులతో కలిసి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ముందుగా బాబాను ఆయన దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు సత్యాల వెంకట్, వానపల్లి ఈశ్వరరావు, పి.వాసు, సాగరికి, కె.శిరీషా, సిహెచ్.నాగేశ్వరరావు, దుర్గారావు, బేగం పాల్గొన్నారు.